

## తాటి, ఈత చెట్లను నరికితే కఠిన చర్యలు

ఆమనగల్లు, మే 21 : అనుమతులు లేకుండా తాటి, ఈత చెట్లను నరికితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల్లో మంగళవారం సీఐ పర్యటించారు. తాటి, ఈత చెట్లను కొన్ని గ్రామాల్లో నరికి వేస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయా మండలాల్లో గీత కార్మికులు, రైతులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అవగాహన కల్పించారు.



అధికారులతో మాట్లాడుతున్న అనితారెడ్డి హరినాథ్‌రెడ్డి

## తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

» స్థాయీసంఘాల సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ అనిత

ఆంధ్రజ్యోతి రంగారెడ్డి అర్బన్, మే 21 : వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనిత హరినాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ అభివృద్ధి, విద్య, వైద్యం, పనులు, ప్రణాళిక, ఆర్థిక అంశాలపై జిల్లా అధికారులతో జెడ్పీ చైర్‌పర్సన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ ఎంత మోతాదులో చేశారు. ఎన్ని ఇండ్లు లబ్ధిదారులకు అందించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఎంతమంది దరఖాస్తులు చేసుకున్నారని తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం ఏ విధంగా నడుస్తుందని మహిళలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రజలతో చర్చించి మరింత సులభతరంగా ప్రయాణం చేయాలని అధికారులకు సూచించారు. వేసవి కాలం కారణంగా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బంది రాకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతిలో ఎంతమంది పర్సంటేజ్ వచ్చింది విద్యాశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొండాపూర్, వనస్థలిపురం ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండేటట్టు చూడాలని వైద్యులను ఆదేశించారు. వర్షాకాలంలో పాముకాటు, తేలుకాటుకి గురై ఆసుప్రతికి వచ్చే రోగులకు ఇంజక్షన్స్, మందులు అందుబాటులో ఉండేట్టు చూడాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు రాకుండా విద్యుత్ అధికారులు చూసుకోవాలన్నారు. గ్రామాల్లో అవసరమైన కరెంట్ స్తంభాలు, ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ఈట గణేశ్, జెడ్పీటీసీలు బొక్క జంగా రెడ్డి, మహిపాల్, నిత్య నిరజంన్‌రెడ్డి, అనురాధ, పద్యనాయక్, దశరథ్‌నాయక్, రాగమ్మ, శ్రీలత, అవినాష్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, కో- ఆప్షన్ సభ్యుడు అలీ అక్బర్ ఖాన్, సీఈవో కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో రంగారావు తదితరులు పాల్గొన్నారు.

**ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎంతమంది పాలకులు మారినా రైతుల బతుకులు మాత్రం మారడం లేదు. ప్రతీ ఏడాది వ్యాపారుల చేతిలో మోసపోయి నష్టాల బారిన పడుతూనే ఉన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల ధరలు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. రైతు పండించిన పంటకు మాత్రం ఏనాడూ గిట్టుబాటు ధర రావడం లేదు. దీంతో పెరిగిన ఎరువులు, విత్తనాల ధరలు చెల్లించలేక రైతులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.**

# రైతు నెత్తిన ధరల పిడుగు

## ఎరువులు, విత్తనాల ధరల పెరుగుదలతో భారం



» ప్రతీ ఏటా పెరుగుతున్న రేట్లు
» పండించిన పంటకు మాత్రం దక్కని మద్దతు
» ధాన్యం తమకే అమ్మాలన్న నిబంధనతో అప్పు ఇస్తున్న ఎరువుల వ్యాపారులు
» తక్కువ ధరకే పంట కొనుగోలు
» రెండు విధాలుగా నష్టపోతున్న రైతన్నలు
» ప్రతీ ఏడాది నష్టాల బాటలోనే రైతులు


**ధరల పెరుగుదల ఇలా (రూపాయల్లో)**

| ఎరువుల ధరలు | | | |
|---|---|---|---|
| ఎరువు | 2022 | 2023 | 2024 |
| యూరియా | 267 | 267 | 267 |
| 28:28:0 | 1,450 | 1,500 | 1,700 |
| డీఏపీ | 1,225 | 1,280 | 1,350 |
| **విత్తనాల ధరలు** | | | |
| విత్తన రకం | 2022 | 2023 | 2024 |
| హంస (25కిలోలు) | 950 | 1,000 | 1,100 |
| బీపీటీ | 1,000 | 1,060 | 1,150 |
| ఆర్ఎన్ఆర్ | 900 | 950 | 1,000 |
| పత్తి | 800 | 960 | 1,100 |
| మొక్కజొన్న | 550 | 600 | 715 |
| కంది | 200 | 250 | 300 |
| పెసర | 200 | 250 | 280 |
| జనుము | 800 | 835 | 900 |

యాచారం, మే 21: ప్రతీ ఏటా ఎరువుల విత్తనాల ధరలు పెరుగుతుండడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ఎ రువుల, విత్తనాల ధరలను ఏటేటా పెరుగుతున్నందున పంట పెట్టుబడులకు అప్పులు చేసి దివాళా తీస్తున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎరువులు, విత్తనాల ధరలు పెరిగినా తాము పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధర ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నిస్తున్నారు. పంటల సాగు కోసం అనేకమంది రైతులు తమ వెండి, బంగారు నగలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి అప్పు తెచ్చి మరీ సాగు చేస్తున్నారు. ఏటా ఎరువులు, విత్తనాల ధరలు పెరిగినా పంట పండించడం కోసం అప్పులు చేయక తప్పడం లేదు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో బ్లాక్ మార్కెటీర్లు ఎరువులు, విత్తనాలు అధిక ధరల కమ్మడంతో పాటు పంట చేతికందగానే తమకే ధాన్యం విక్రయించాలని నిబంధన విధించి ఎరువులు, విత్తనాలు ఉద్దెరకిస్తున్నారు, ఉద్దెరగా ఎ రువులు విత్తనాలు తీసుకున్న రైతుల నుంచి ధాన్యం కూడా తక్కువ ధరకే కొంటున్నారు. దీంతో అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు కొనడంతో పాటు పండించిన పంటను తక్కువ ధరకు ఆ వ్యాపారులకే ఇవ్వాల్సి రావడంతో రెండు విధాలుగా నష్టాల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నకిలీ పత్తి విత్తనాలు అంటగడుతున్న దళారులు

కొంతమంది దళారులు పత్తి విత్తనాలను అధిక ధరలకమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి నకిలీ పత్తి విత్తనాలను తెచ్చి రైతులకు అధిక ధరలకమ్మడం కోసం యత్నిస్తున్నారు. ఈ ఏడాది యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులతో పాటు వ్యవసాయాధికారులు నకిలీ పత్తి విత్తనాల క్రయ విక్రయాలు జరగకుండా అప్రమత్తంగా ఉన్నట్లు పోలీసులు చెప్పారు. అయితే, పత్తి విత్తనాలను అధిక ధరకు అమ్మడం కోసం గోప్యంగా పావులు కదుపుతున్నట్టు జోరుగా చర్చ సాగుతోంది. పత్తి విత్తనాలు కొనే ముందు ఐఎస్ఐ ముద్ర ఉందా.. లేదా సరిచూసుకోవాలని, ఆ ముద్ర లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ రైతులను కోరారు.



### ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతాం

ఈ సారి రైతులు ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఈ సారి జీలుగ విత్తనాలు కూడా తేవడం కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పంపాం. డీఏపీ, యూరియా, జనుము విత్తనాలు కావాలని ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టినం. రైతులు పంట పెట్టుబడి కోసం ఇతరులపై ఆధారపడకండి. బంగారు, వెండి అభరణాలు తాకట్టుపెట్టి రుణం ఇవ్వడం కోసం ఏర్పాట్లు చేస్తున్నాం.

**టి.రాజేందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్, యాచారం**



# కౌలురైతుపై చిన్నచూపు!

» పట్టాదారులకే పట్టం కడుతున్న పాలకులు
» ప్రభుత్వ విధివిధానాలతో నష్టపోతున్న కౌలు రైతులు
» ఇప్పటికే రైతు భరోసా అందక ఇక్కట్లు
» రుణమాఫీ పథకమైనా అమలు చేయాలని వేడుకోలు

షాబాద్, మే 21 : పట్టా ఉన్న రైతులకు పట్టం కడుతూ పాలకవర్గాలు కౌలు రైతులను మాత్రం చిన్నచూపు చూస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ. 2లక్షల రుణమాఫీ పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆ పథకాన్ని కౌలు రైతులను కూడా వర్తింపజేయాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి. షాబాద్ మండలంలో సుమారు 1,500 మంది కౌలు రైతులున్నారు. సాగు కోసం అనేకమంది రైతులు బ్యాంకుల్లో వడ్డీలకు అప్పులు తెచ్చి అవస్థలు పడ్డారు. అయితే, వీరికి రుణమాఫీ అమలుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో కైలు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

### అధిక వడ్డీలతో కుదేలు...

రాష్ట్రంలో కౌలు రైతుల రక్షణ చట్టం 10 సెక్షన్ ప్రకారం కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు పొందే హక్కు కలిగి ఉన్నారు. కాగా 2016 -17 నించి వాటిని నిలిపివేయడంతో క్షేత్రస్థాయిలో వ్యవసాయం చేస్తున్న కౌలురైతులు రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందకపోవడంతో అధిక వడ్డీలకు నగదు తీసుకొని పంట సాగు చేస్తున్నారు. తీరా ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయి, పంట కోసం తెచ్చిన అప్పులు తీర్చుకోలేక దిక్కుతోచని స్థితిలో తలలు పట్టుకుంటున్నారు.

### పట్టాదారులకే పట్టం

ప్రభుత్వం ఇప్పటి వరకు కౌలు రైతులను గుర్తించకపోవడంతో వ్యవసాయ పరంగా అనేక పథకాలకు వారు దూరమవుతున్నారు. రైతుబంధు పథకం భూమి ఉన్న రైతులకే ప్రభుత్వం ఇస్తుండడంతో కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. భూమి ఉన్న రైతులకు రైతుబంధుతో పాటు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సైతం మాఫీ చేస్తున్నారు. భూమి దున్నే రైతుకు ఆదరణ లేకపోవడం, కౌలు కూడా రెట్టింపు కావడంతో వారి పరిస్థితి దారుణంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం కౌలు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కౌలురైతులకు రుణాలను అందజేయాలని కౌలు రైతులు కోరుతున్నారు. ఇక నుంచి ప్రభుత్వం కౌలు రైతులకు కార్డులు అందజేయడంతో పాటు బ్యాంకుల్లో కూడా వారికి రుణాలు అందజేయాలని, రుణమాఫీలో కౌలురైతులను చేర్చాలని వేడుకుంటున్నారు.



### కౌలురైతు చట్టం అమలు చేయాలి

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా కౌలురైతుల కోసం ప్రభుత్వం కౌలురైతు చట్టం వెంటనే అమలు చేయాలి. వారిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి. వారు సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలి.

**- దండు యాదవరెడ్డి, షాబాద్**

### రైతుబంధు, రైతుబీమా వర్తింపజేయాలి



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. పెద్దరైతులకే కాకుండా కౌలురైతులకు రుణాలు అందించాలి. రైతుబంధు, రైతుబీమా అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కౌలురైతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

**- మహేశ్వరం మల్లయ్య, కౌలురైతు, ఎర్రోనిగూడ**



# కళ్యాణ వైభోగమే...!

» వైభవంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం
» భారీగా హాజరైన భక్తులు

కేశంపేట, మే 21: ఎక్లాస్ ఖాన్‌పేటలోని సకల దేవతల ఆలయంలో మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో దేవతమూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. పండితులు మంత్రోచ్ఛరణలు, మేళతాళాల మధ్య ఎంపీపీ రవీందర్ యాదవ్- కవిత, బీఆర్ఎస్ నాయకుడు మురళీకృష్ణ- హిమబిందు దంపతులు కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి హైదరాబాద్, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, జడ్చర్ల, ఆమనగల్, మహేశ్వరం, శంషాబాద్‌లను నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పొడగుట్ట తండాకు చెందిన శంకర్ నాయక్ భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉక్కపోతతో భక్తులు ఇబ్బందులు పడకుండా కూలర్లు ఏర్పాటు చేశారు. అలాగే మంచినీటి సౌకర్యం కల్పించారు. కల్యాణోత్సవానికి కేశంపేట మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణ గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది శ్రీనివాస్ యాదవ్, అంజిరెడ్డి, గోగు వెంకటనారాయణ రెడ్డి, నవీన్ రెడ్డి, యారం శేఖర్ రెడ్డి, జమాల్‌ఖాన్, శ్రీపాల్ రెడ్డి, వెంకన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ శశాంక్**

ఆదిభట్ల, మే 21: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక్ అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం మండలం మెట్టిళ్ల, దండు మైలారం గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డితో కలిసి కలెక్టర్ శశాంక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మెట్టిళ్లలోని ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ, ఎంపీ పటేల్‌గూడలో సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి కొనుగోలు కేంద్రాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా ..? అని ఆరా తీశారు. ధాన్యానికి తరుగు ఏమైనా తీస్తున్నారా అంటూ రైతులను ప్రశ్నించగా ఏమీ తీయడం లేదని రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియజేయాలని జిల్లా స్థాయి సివిల్ సప్లై అధికారి నెంబర్ 79950 50714కు రాష్ట్ర స్థాయిలో అందుబాటులో ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 1967 కు ఫిర్యాదులు సలహాలు, సూచనలు తెలియజేయవచ్చని కలెక్టర్ రైతులకు సూచించారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం జరిపించాలని.. సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే లారీలలో లోడ్ చేయించి రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రాల వద్ద సరిపడా హమాలీలు సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యంతో ఉన్న లారీలను నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. అకాల వర్షాలు కుర్తున్న నేపథ్యంలో ధాన్యం తరలింపులో జాప్యం లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అకాల వర్షాలను చూసి రైతులు ఆందోళనకు గురికావద్దని.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లిస్తామని చెప్పారు. తొందరపడి దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని కలెక్టర్ రైతులకు భరోసా కల్పించారు. కార్యక్రమలో కలెక్టర్‌తో పాటు డీసీఓ ధాత్రిదేవి, సివిల్ సప్లయ్ అధికారులు మనోహర్ కుమార్ రాథోడ్, డీఎం విజయలక్ష్మి, అగ్రికల్చర్ ఏఓ వరప్రసాద్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక్

## రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

» డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్ రావు

ఆమనగల్లు , మే 21: వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు కోరారు. విధుల నిర్వహణలో ఎక్కడా అలసత్వానికి తావివ్వకూడదని సూచించారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్ రావు సందర్శించారు. రికార్డులను ,మందుల నిల్వలను, పరిసరాలను పరిశీలించారు. వైద్య చికిత్సకు వచ్చిన రోగులతో ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి నూతన భవన నిర్మాణం నేపథ్యంలో పాత భవనాన్ని తొలగించనున్నందున ఆసుపత్రిని తాత్కాలికంగా ఆసుపత్రి ఆవరణలో ఉన్న క్లస్టర్ భవనం, హోమియో ఆసుపత్రిలోకి మార్చాలని డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్ రావు ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి సూచించారు. డాక్టర్ పరిక్షిత్ నరేంద్రకు పలు సూచనలు చేశారు. కొత్త భవనం నిర్మాణం నేపథ్యంలో రోగులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు వెంకటేశ్వర్ రావు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్లు పరీక్షత్ నరేంద్ర, హోమియోపతి డాక్టర్ అర్చనారెడ్డి, సిబ్బంది హన్మంత్, ఇందిర, ఏసుమణి, కృష్ణలీల, సునీత, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్ రావు

## ఇంటర్ సప్లిమెంటరీ

# పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి శంకర్



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, మే 21: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎ న్.శంకర్ తెలిపారు. వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్స్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ మెంబెర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో మౌలిక వసతుల కల్పనతో పాటు తాగునీరు, నిరంతర విద్యుత్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అదేవిధంగా రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వికారాబాద్‌లో ఐదు, తాండూరులో నాలుగు, పరిగిలో నాలుగు పరీక్షా కేంద్రాలను, అదేవిధంగా నవాబుపేట్, పెద్దేముల్, మర్పల్లి, మోమిన్‌పేట్, దోమ, కొడంగల్, కులకచర్ల మండలాల్లో ఒక్కో పరీక్ష కేంద్రం చొప్పున మొత్తం 20పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కోర్సులలో కలిపి 7831 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్ష లకు 4621మంది , రెండవ సంవత్సరం పరీక్షలకు 3210మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఆయన వివరించారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రానికి సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్ష సమయంలో మెడికల్ సిబ్బంది సరైన మందులతో అందుబాటులో ఉండాలన్నారు. పరీక్షలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు రాజమోహన్‌రావు, బుచ్చయ్య, ప్రిన్సిపాల్‌లు నర్సింహారెడ్డి, చెన్నయ్య, సురేశ్వరస్వామి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.

## చెరువులో వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎదులాబాద్ మత్స్యకారులు

ఘట్‌కేసర్ రూరల్, మే 21: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు, చర్లపల్లి పారిశ్రామికవాడ రసాయన వ్యర్థాలు చెరువులో కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎదులాబాద్ మత్స్యకారులు మంగళవారం వికారాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జవహర్‌నగర్ డంపిగ్‌యార్డుతో పాటు చర్లపల్లి పారిశ్రామికవాడ వెలువడిన రసాయనవ్యర్థాలు ఎరిమల్లేవాగు నుంచి నేరుగా ఎదులాబాద్ లక్ష్మినారాయణచెరువులో కలిసి నీరంతా కలుషితమవుతోందని అన్నారు. ఈ చెరువుపై ఆధారపడి 700కుటుంబాలు చేపలు పట్టుకొని జీవనోపాధి సాగిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈచెరువు ఆయకట్ట కింద 2వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ వ్యర్థాలు, చర్లపల్లి పారిశ్రామికవాడ నుంచి వెలుపడే రసాయన వ్యర్థాలు చెరువులో కలవడం వల్ల సాగునీరు, తాగునీరు కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. వ్యర్థాలు కలవడం వల్ల వేలసంఖ్యలో చేపలు మృత్యువాతపడి తమ కుటుంబాలు రోడ్డుపడుతున్నాయని తెలిపారు. వ్యర్థాలు కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎదులాబాద్ మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పూస యాదగిరి, కార్యదర్శి పూస నర్సింగ్‌రావు, మాజీ అధ్యక్షుడు మెంగ బాలకృష్ణ, మాజీ కార్యదర్శి పూస బాలయ్య పాల్గొన్నారు.

## నెలాఖరు వరకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ఎండీ.సత్తార్

తాండూరు రూరల్, మే 21: ప్రభుత్వ పాఠశాలల్లో నెలాఖరువరకు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి ఎంఎ సత్తార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం లో మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శు లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ తాండూరు మండలంలో 45ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆ దర్శ పథకం కింద ఎంపిక చేశామన్నారు. రూ.47లక్షలతో పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిందన్నారు. వీటితో ఆయా గ్రామాల్లో ని పాఠశాలల్లో తాగునీరు మూత్రశాలలు, మైనర్ రిపేర్లు, విద్యుత్ సౌ కర్యం వంటి పనులు గ్రామాల్లోని వీవోల ద్వారా వసూలుచేయడం జ రిగిందని అన్నారు. మిగిలిన పాఠశాలల్లో ఈనెలాఖరు నాటికి పూర్తి చే సేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపా ధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు అట్టి పనులను పర్యవేక్షించి పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వాటి కి సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు పంచాయతీ రాజ్ ఏఈకి అ ందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విశ్వప్రసాద్, ఎంపీవో రతన్‌సింగ్, ఎంఈవో వెంకటయ్య, ఉద్యానవన శాఖ అధికారి మల్లికా ర్జున్, హెచ్‌ఎంలు కిష్టప్ప, నర్సిరెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌చారి, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు లాలప్ప తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో డాక్టర్ మల్లు రవి

## దేశంలో బీజేపీ పతనం ప్రారంభం

ఆమనగల్లు, మే 21 : దేశంలో బీజేపీ పతనం ప్రారంభమైందని, అందుకే ప్రధాని మోదీ నిరుత్సాహంతో సహనం కోల్పోయి మాట్లాడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ప్రజావ్యతిరేకతను గ్రహించిన మోదీ దేశంలో కుట్ర రాజకీయాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మంగళవారం ఢిల్లీ నార్త్ ఈస్ట్ పార్లమెంట్ నియోజకవర్గంలో మల్లు రవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా ఈ కాంగ్రెస్‌తో కలిసి రావాలన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగానికే ప్రమాదమని మల్లు రవి పేర్కొన్నారు. కాంగ్రెస్ తోనే సామాజిక న్యాయ, సుస్థిర పాలన సాధ్యమన్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభంజనం మొదలైందని, రాహుల్ నేతృత్వంలో 'ఇండియా' కూటమి అధికారంలోకి రావడం ఖాయమని మల్లు ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని కాంక్షించి ప్రజలంతా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారని, రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మహ్మద్ హసన్, మాజీ ఎమ్మెల్యే చౌదరి, నాయకులు అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## చౌడాపూర్ మండల కేంద్రానికి కేజీబీవీ మంజూరు



చౌడాపూర్‌లో కేజీబీవీ ఏర్పాటుకు భవనాన్ని పరిశీలిస్తున్న జీసీడీవో శ్రీదేవి

కులకచర్ల, మే 21: మండల కేంద్రం చౌడాపూర్‌కు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం మంజూరైంది. ఈ విద్యాసంవత్సరం కొత్తగా ప్రారంభించనున్నారు. అందులో భాగంగా మంగళవారం భవన పరిశీలన కోసం జీసీడీవో శ్రీదేవి మండల కేంద్రానికి వచ్చారు. చౌడాపూర్, మందిపాల్, మక్తవెంకటాపూర్ గ్రామాల్లో కేజీబీవీ పాఠశాలల ఏర్పాటు కోసం భవనాలను పరిశీలించారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రస్తుతానికి అద్దె భవనంలో కొనసాగిస్తామన్నారు. స్థలసేకరణ అనంతరం సొంత భవనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ నాగరాజు, ఎంఈవో హబీబ్ అహ్మద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న సౌమ్య

## ఆయిల్‌పామ్ సాగుతో లాభదాయకం

కడ్తాల్, మే 21: ఆయిల్‌పామ్ సాగు రైతులకు అన్నివిధాలా లాభదాయకమని మండల ఉద్యానవన శాఖ అధికారి సౌమ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట సాగుకు రైతులకు అన్ని విధాలా చేయూత నందిస్తుందన్నారు. కడ్తాల మండలం మక్తమాదారం గ్రామంలో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ఉద్యానవ శాఖ అధికారి సౌమ్య అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మక్తమాదారంతో పాటు సమీప గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఆయిల్‌పామ్ సాగు, దిగుబడి, ప్రభుత్వం అందించే ప్రోత్సాహకం గురించి అధికారులు రైతులకు వివరించి అవగాహన కల్పించారు. నీటి వసతి ఉన్న పొలాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉంటుందని సౌమ్య తెలిపారు. ఈ పంటకు చీడ, పీడల బాధకూడా తక్కువ ఉంటుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ ఎకరానికి 8 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని వివరించారు. పంటకు పెట్టుబడిగా ప్రభుత్వం మొక్కలకు 90 శాతం రాయితీ, డ్రిప్ ఇరిగేషన్‌కు 80 నుంచి 100 శాతం రాయితీ.. మొక్క నాటిన నాలుగు సంవత్సరాల వరకు ఎకరాకు రూ.4,200 నిర్వహణ ఖర్చులు ఇస్తుందని సౌమ్య వివరించారు. నాలుగేళ్ల నుంచి పంట దిగుబడి మొదలై 30 సంవత్సరాల వరకు వస్తుందని తెలిపారు. వాల్యూ ఆయిల్ కంపెనీ ఏరియా మేనేజర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి ఒక ఫీల్డ్ ఆఫీసర్, మరో ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించి నిరంతరం పంట పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రమణ, ఫీల్డ్ ఆఫీసర్, హిమకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పిస్తాహౌస్ హోటల్లో పురుగుల కలకలం

- బిర్యానీలో పురుగులు కనిపించడంతో కంగుతిన్న వినియోగదారుడు



మొయినాబాద్ రూరల్, మే 21 : మండల పరిధిలోని హిమాయత్ నగర్‌లోని పిస్తాహౌస్ హోటల్లో ఆహారంలో పురుగులు ఉండటంతో వినియోగదారుడు ఖంగుతిన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పేరుకే బ్రాండ్ హోటల్ కానీ, లోపల, పరిసర ప్రాంతాలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఆహారభద్రత పర్యవేక్షణ అధికారుల తనిఖీల లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ పరిధిలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే ఇటీవల పిస్తాహౌస్ పేరుతో హోటల్‌ను ఏర్పాటు చేశారు. పాతబస్తీకి చెందిన మహ్మద్ ఫారూక్ తన స్నేహితులతో కలిసి వికారాబాద్ వెళ్లి తిరుగు ప్రయాణంలో శనివారం రాత్రి పిస్తాహౌస్ హోటల్లో తినేందుకు బిర్యానీ ఆర్డర్ ఇచ్చాడు. సర్వర్ బిర్యానీ తీసుకువచ్చి వడ్డించాడు. ఈక్రమంలో బిర్యానీ కొంచెం తినేసరికి అందులో పురుగులు కనిపించడంతో కంగుతిన్న ఫారూక్ అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీయగా పొంతన లేని సమాధానం ఇవ్వడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. పేరుకే బ్రాండ్ హోటల్ అని.. లోపల చూస్తే ఏమీలేదని, ప్రజల ఆరోగ్యాలతో హోటల్ నిర్వాహకులు ఆడుకుంటున్నారని ఆరోపించారు. హోటల్‌పై చర్యలు తీసుకునేందుకు అధికారులు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. త్వరలో హోటల్‌పై ఫుడ్ సెక్యూరిటీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పి స్నేహితులతో కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా, మండల పరిధిలో ఇటీవల కాలంలో అనేక హోటళ్లు వెలిశాయి. నిబంధనలు పాటించకుండా ఇస్టానుసారంగా కల్తీతో పదార్థాలతో ఆహారాలను తయారుచేసి ప్రజలకు వడ్డిస్తున్నారు. దాంతో ప్రజలు అనారోగ్యాలకు గురైతున్నారు. అధికారులు కూడా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పిస్తాహౌస్, ఇతర హోటళ్లను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## 'ధరణి' దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

- మే 31 వరకు పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు
- ధరణి పెండింగ్ సమస్యలపై అధికారులతో జిల్లా కలెక్టర్ శశాంక సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిశీలన క్షుణ్ణంగా చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా బాధ్యతగా పని చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు జిల్లా కలెక్టర్ శశాంక సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో దరఖాస్తుల పరిశీలన, ప్రభుత్వ భూముల రక్షణపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ధరణి పోర్టల్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఏవిధంగా పరిష్కరించాలి అనే విషయంపై ఆర్డీవోలకు, తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గడువు లోపల పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతీ దరఖాస్తును క్షుణంగా పరిశీలించి, అవసరమైతే ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తిస్థాయిలో కలెక్టరేట్‌కు సమర్పించాలన్నారు. మే 31వరకు పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా ప్రభుత్వ భూముల వివరాలు.. ప్రతీ తహసీల్దార్ వద్ద ఉండాలన్నారు. ధరణి దరఖాస్తులను అందుబాటులో ఉన్న రికార్డుల ద్వారా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్, మే 21 : మండల పరిధిలోని ముచ్చింతల్ స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో నిర్వహిస్తున్న మగ్గం వర్క్ ఉచిత శిక్షణ శిబిరాన్ని మహిళలకు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణభారత్ ట్రస్ట్, ఇండియన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరంలో 19-45 ఏళ్ల వయస్సున్న మహిళలు ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన మహిళలు మాత్రమే అర్హులు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, కల్పిస్తామని చెప్పారు. శిక్షణకు వచ్చేవారు ఆధార్, రేషన్ కార్డుతో పాటు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకు రావాలని చెప్పారు. అయితే, శిక్షణకు వచ్చే మహిళలకు కనీసం చదవడం, రాయడం వచ్చి ఉండాలని సూచించారు. వివరాలకు 9391487797/9177141712/9618534720 నెంబర్లను సంప్రదించలని నిర్వాహకులు సూచించారు.

## దోపిడీకి ప్రైవేట్ విద్యాసంస్థలు సిద్ధం!

- తోక పేర్లు, ఫలితాలపై తప్పుడు ప్రచారాలు
- సంపాదనే ధ్యేయంగా సంస్థలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



పరిగి, మే 21: పాఠశాలల ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండటంతో ప్రైవేట్ పాఠశాలలు దోపిడీకి సిద్ధమయ్యాయి. విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకర్షించడానికి ప్లే, టెక్నో, ఈ-టెక్నో, కరీక్యూలమ్, ఎక్సలెన్స్, గ్లోబల్, టాలెంట్ తదితర తోకపేర్లతో ప్రచారం నిర్వహిస్తున్నాయి. నిబంధనల ప్రకారం విద్యాహక్కు చట్టానికి లోబడి ఎలాంటి తోకపేర్లు ప్రైవేట్ పాఠశాలలకు అనుమతిలేదు. అదేవిధంగా నిర్ణీత తేదీ తర్వాతనే ప్రవేశాలను స్వీకరించాలి. అయితే జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ఒక అడుగు ముందుకేసి గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారాన్ని ప్రారంభించాయి. పదోతరగతి పరీక్షా ఫలితాలు ఇటీవలే వెలువడ్డాయి. పాఠశాలలు పునఃప్రారంభానికి ఇంకా 25రోజులు ఉండగానే ప్రైవేట్ బడుల ప్రచారం జోరందుకుంది. నిజానికి ఏపాఠశాల కూడా నిబంధనలు పాటించడం లేదన్నది జగమెరిగిన సత్యం. అయినా జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. సీట్లను భర్తీ చేసుకునేందుకు ప్రైవేట్ పాఠశాలలు పోటీపడుతున్నాయి. కొన్ని పాఠశాలలు అనుమతి తక్కువ తరగతులకు ఉండగా, ఎక్కువ తరగతులను నడిపిస్తున్నాయి.

జిల్లాలో 120కిపైగా ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్, కులకచర్ల, మోమిన్‌పేట్, మర్పల్లి, తదితర ప్రాంతాల్లో ఇవి కొనసాగుతున్నాయి. ఇటీవల వెలువడిన టెన్త్ ఫలితాల్లో పరిగిలోని కొన్ని పాఠశాలల యజమాన్యాలు తప్పుడు ప్రచారాలు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదో ఒకరిద్దరి విద్యార్థులపై బాగా దృష్టిపెట్టి పరీక్షల సమయంలో వారిపట్ల మేనేజ్ చేసుకుని వందశాతం గ్రేడింగ్‌లు వచ్చాయని తప్పుడు ప్రచారం చేసుకుంటున్నాయి. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### తప్పుడు ప్రచారాలు..

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఏ ఒక్కటీ ప్రభుత్వ నిబంధనలు పాటించడంలేదు. అర్హులైన ఉపాధ్యాయులు, వసతి సౌకర్యం, పరికరాలు, ఫర్నీచర్, ఆటస్థలం, గ్రంథాలయం, ప్రయోగశాల, మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్వంతభవనం వంటివి కలిగి ఉండాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. అదేవిధంగా పోలీస్, ఫైర్, ఆర్అండ్‌బీ తదితర శాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం గుర్తించే ముందు వీటిని పూర్తిస్థాయిలో విచారణ జరిపి అన్ని అర్హతలు ఉన్నట్లు నిర్ధారిస్తే తప్ప గుర్తింపు ఇవ్వకూడదు. అయితే ఏఒక్క పాఠశాలకు పూర్తి అర్హతలు లేకున్నా ప్రభుత్వ గుర్తింపు మాత్రం లభిస్తోంది. ఒక్కో గదిలో రెండు, మూడు తరగతులు నిర్వహిస్తున్నా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. లైబ్రరీ పేరుతో వందల పుస్తకాలు ఉన్నట్లు రికార్డుల్లో ఉన్నా పాఠశాలల్లో లైబ్రరీ జాడలేకపోవడం గమనార్హం. దీన్నిబట్టి ప్రైవేట్ యాజమాన్యాలకు అధికారులు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిగి పట్టణంలోనే దాదాపుగా 20కిపైగా ప్రైవేట్ విద్య సంస్థలు కొనసాగుతున్నాయి. అడ్మిషన్ల సమయంలో అనుమతిఉందని చెప్పి తల్లిదండ్రులను మభ్యపెట్టి పిల్లలను పాఠశాలల్లో చేర్పించుకుంటున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై ఉన్నతాధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మురుగునీటిని అరికట్టి చెరువులను పరిరక్షించండి

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు
- రాష్ట్ర మున్సిపల్ కమిషనర్‌కు లేఖ

షాద్‌నగర్ అర్బన్, మే 21: ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీలోని చెరువుల్లోకి వస్తున్న షాద్‌నగర్ మున్సిపాలిటీ మురుగునీటిని అరికట్టి చెరువులను పరిరక్షించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు మంగళవారం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌కు లేఖ రాశారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ శివారులో ఉన్న లింగారెడ్డిగూడలో భూగర్భజలాన్ని పెంచి, తాగునీరు, సాగునీటిని అందిస్తున్న గుండ్లకుంట, గురుకుంట, పోచమ్మచెరువు, పెద్దించెరువు, తుంగకుంటలకు, వాటి పాటు కాలువలకు తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మరమ్మతులు చేయించి, అభివృద్ధి పర్చినట్లు తెలిపారు. అయితే, షాద్‌నగర్ మున్సిపాలిటీలోని మురుగునీటిని శుభ్రం చేయకుండా నేరుగా గుండ్లకుంట మీదుగా పోచమ్మచెరువు, పెద్దించెరువు, తుంగకుంటలకు వదిలివేశారని తెలిపారు. గుండ్లకుంటను అక్రమంగా పూడ్చివేయగా, పోచమ్మచెరువు, పెద్దించెరువు, తుంగకుంటలలో మున్సిపాలిటీ వదిలిన మురుగునీరు నిండిందని తెలిపారు. చెరువుల్లోని నీరు తాగునీటికి, సాగునీటికి ఉపయోగపడడం లేదని, కనీసం పశువులు, పక్షులు నీరు తాగలేకపోతున్నాయని, చెరువుల్లో చేపలు సైతం పెరగడం లేదని తెలిపారు. లింగారెడ్డిగూడ గ్రామ అవసరాలకు, పర్యావరణానికి విఘాతం కల్గిస్తున్న షాద్‌నగర్ మున్సిపాలిటీ మురునీరు చెరువుల్లోకి రాకుండా అరికట్టాలని బక్కని నర్సింహులు లేఖలో డిమాండ్ చేశారు.



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న భూపాల్‌రెడ్డి

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

- రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు
- జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 21: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కొనుగోళ్ల సమయంలో రైతులకు ఏమాత్రం ఇబ్బందులు కలిగించొద్దని ఆయన అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అలాగే రాయపోల్ గ్రామంలో ధాన్యం నిల్వలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. హమాలీల కొరత మూలంగా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుందని రోజులకొద్ది పడిగాపులు గాస్తున్నామని రైతులు వాపోయారు. అంతేగాకుండా లారీలు సమయానికి రావడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. టార్పాలిన్లను అందించే ఏర్పాట్లు చేయాలని కూడా రైతులు కోరారు. హమాలీల సంఖ్యను పెంచి వెంటవెంటనే కొనుగోళ్లు చేయాలని డీసీఎంఎస్, మార్కెటింగ్, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ధాన్యం తరలించే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ధాన్యం నిల్వలను ఎత్తుకెళ్లడానికి లారీలు వెంట వెంటనే వచ్చేట్లు చూడాలన్నారు. వీలైనంతమేరకు ఈ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆయనవెంట జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి విజయలక్ష్మి, జిల్లా సహకార శాఖ అధికారి ధాత్రిదేవి, డీఎస్‌వో రాథోడ్, ఏవో వరప్రసాద్‌రెడ్డి, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, రఘు, డీసీఎంఎస్ మేనేజర్ రాజు, రైతులు తదితరులు ఉన్నారు.

## పల్లెలపై సైబర్ వల

- అమాయకత్వంతో సైబర్ నేరగాళ్ల వలలో పడిన యువకులు
- రూ.వెయ్యితో మోసం నుంచి బయటపడిన వైనం



సైబర్ నేరగాళ్ల వలలో పడిన యువకులు

బషీరాబాద్, మే 21 : రోజు ఏదో ఒకచోట సైబర్ నేరగాళ్ల మోసానికి అమాయకులు చిక్కుతున్నారు. ఒకప్పుడు పట్టణాల్లోనే వినిపించిన సైబర్ మోసాలు ఇప్పుడు పల్లెల్లోనూ చోటుచేసుకుంటున్నాయి. గ్రామీణ యువకులే లక్ష్యంగా కేటుగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటనే బషీరాబాద్ మండలం వాల్యానాయక్ తండాలో బుధవారం జరిగింది. తండాకు చెందిన సిద్ధు అనే యువకుడు స్థానికంగా ఇటుక తయారు చేసి విక్రయిస్తున్నాడు. సోమవారం సాయంత్రం ఓ ఫోన్‌కాల్ వచ్చింది. 'మాకు ఇటుకలు కావాలని, మంతట్టి రైల్వే స్టేషన్ వద్ద పనులు జరుగుతున్నాయిని.' అని చెప్పాడు. అక్కడికి ఇటుకలు తేవాలని కోరగా.. సిద్ధు ట్రాక్టర్‌లో ఇటుక లోడ్‌తో మంగళవారం ఉదయం వెళ్లాడు. ఇటుక ఆర్డర్ చేసిన నంబర్‌కు చేయగా, మా హెడ్ ఆఫీస్ నంబర్ ఇస్తా.. మాట్లడాలని సూచించాడు. సదరు నంబర్‌కు కాల్ చేయగా ఇటుక రేటు, మొత్తం ఎంత డబ్బివ్వాలని అడిగాడు. ఇటుక విలువ రూ.22,500 అని వ్యాపారి చెప్పాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. 'రైల్వేలో ఇటుక డబ్బులు చెల్లించాలంటే మొదట నువ్వు రూ.22,500 మాకు పంపాలి. ఆ అమౌంట్‌తో పాటు ఇటుక డబ్బులు కూడా పంపిస్తాం.' అని చెప్పాడు. అది నిజమని సిద్ధు నమ్మి ఆ వ్యక్తి పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రూ.12వేలు పంపే ప్రయత్నం చేశాడు. సాంకేతిక సమస్య రాగా, మళ్లీ రూ.2వేలు పంపగా డబ్బులు కట్ కాలేదు. మరోసారి తన వెంట ఉన్న బంధువుతో కలిసి డబ్బులు పంపే ప్రయత్నం చేయగా రూ.వెయ్యి కట్ అయ్యాయి. ఇదేదో మోసంలా ఉందని గ్రహించిన యువకులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై బషీరాబాద్ ఎస్ఐ రమేష్‌ను అడుగగా ఇది సైబర్ నేరగాళ్ల పనే అన్నారు. ఇలాంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా అక్కడక్కడ యువకులు మోసాల బారినపడుతున్నారని అన్నారు. ప్రజలు అపరిచితులకు డబ్బు పంపొద్దని, అనుమానాస్పద ఫోన్‌కాల్స్, మెయిల్స్‌కు స్పందించవద్దన్నారు. మోసానికి గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయలన్నారు.

## గొర్రెల డీడీలు వాపసు ఇవ్వాలి

- అధికారులకు లబ్ధిదారుల దరఖాస్తులు



కొడంగల్ రూరల్, మే 21: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గొల్ల కురుమలకు ఉపాధి కల్పించేందుకు 75శాతం రాయితీతో మొదటి విడతలో గొర్రెలను పంపిణీ చేసింది. రెండో విడత పంపిణీకి అధికారులు లబ్ధిదారుల నుంచి డీడీలు కట్టించుకున్నారు. ఇందుకు లబ్ధిదారులు అధికసంఖ్యలో ప్రైవేట్‌లో అప్పులుచేసి డీడీలు చెల్లించి ఏడాది గడుస్తోంది. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, కొత్తప్రభుత్వం గొర్రెల పంపిణీపై స్పష్టత ఇవ్వకపోవడంతో తాము చెల్లించిన డీడీలను వెనక్కి తీసుకుంటున్నారు.

### ఇప్పటికే 400 మంది

కొడంగల్ మండలంలో అధికారుల లెక్కల ప్రకారం గత సంవత్సరం రెండో విడతలో 75 శాతం రాయితీతో గొర్రెల యూనిట్లను పంపిణీ చేయాలని నిర్ణయించగా మండలంలో 870 మంది డీడీలు చెల్లించారు. ఒక్కొక్క యూనిట్ ధర రూ.1లక్ష 75వేలు కాగా అందులో లబ్ధిదారుల వాటా రూ.43750 చెల్లిస్తే మిగతా రూ.1లక్ష 31 వేల 250 ప్రభుత్వం భరిస్తుంది. అయితే సంవత్సరం గడుస్తున్నా రెండో విడత గొర్రెల యూనిట్లు లబ్ధిదారులకు పంపిణీ చేయకోవడంతో తాము డీడీలు వెనక్కి తీసుకోవాలని దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇప్పటికే సగం మంది డీడీలు సంబంధిత పశువైద్యశాలల్లో అధికారులకు అందించడంతో జిల్లాస్థాయి అధికారులకు పంపించినట్లు సమాచారం.

### వడ్డీ భారంతో నష్టపోయాం




నూటికి రూ.3 చొప్పున వడ్డీకి తెచ్చి డీడీలు కట్టి ఏడాది అయినా రాయితీ మాట దేవుడెరుగు.. అప్పులు అంతకంతకు పెరిగిపోతున్నాయి. ఈపరిస్థితిలో డీడీలు వాపసుతో డబ్బులు వెనక్కి తీసుకోవడం మేలనిపిస్తుంది.

అశోక్, పర్సాపూర్

## ఇళ్లముందు విద్యుత్ లైన్ వేయొద్దు

- పులుసుమామిడి-పర్వతాపూర్ గ్రామస్థులు
- విద్యుత్ స్తంభాలు పాతడాన్ని అడ్డుకున్న రైతులు



పులుసుమామిడి-పర్వతాపూర్ రోడ్డు పక్కనే పాతిన స్తంభాలు



పాతిన స్తంభాన్ని తీసేయిస్తున్న పర్వతాపూర్ గ్రామస్థులు

కొందుర్గు, మే 21: తమ ఇళ్ల ముందరి నుంచి విద్యుత్ లైన్ వేయవద్దని మంగళవారం మండల పరిధిలోని పులుసుమామిడి-పర్వతాపూర్ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పర్వతాపూర్‌కు దగ్గరగా, మహదేవ్‌పూర్ శివారులో ఓ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారని, ఇందుకోసం రాంచంద్రాపూర్ చౌరస్తా నుంచి పులుసుమామిడి మీదుగా, పర్వతాపూర్ రోడ్డు పక్క నుంచి విద్యుత్‌లైన్ వేస్తున్నారని వారు తెలిపారు. దీనివల్ల తమ ఇళ్ల ముందరి నుంచి, ఇండ్లపైనుంచి విద్యుత్ లైన్ వేయడం వల్ల భవిష్యత్తులో ఇళ్ల మరమ్మతులు చేసుకోవాలన్నా, శుభకార్యాలకు టెంట్స్ వేసుకోవాలన్నా ఇబ్బందులు తలెత్తుతాయని పులుసుమామిడి గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. రాంచంద్రాపూర్ చౌరస్తా నుంచి పర్వతాపూర్‌లో పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలం వరకు విద్యుత్ స్తంభాలను రోడ్డు పక్కనే పాతుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతాయని పర్వతాపూర్ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై మార్చి 7న కొందుర్గు ట్రాన్స్‌కో ఏఈకి వినతి పత్రం అందజేశామని, సదరు పరిశ్రమ కాంట్రాక్టర్ విద్యుత్ స్తంభాలను పాతడంతో, అదే నెల 14న ట్రాన్స్‌కో షాద్‌నగర్ ఏడి మాధవరావుకు మరో వినతిపత్రం ఇచ్చామని, పనులను నిలిపి వేశారని రెండు గ్రామాల ప్రజలు తెలిపారు. మంగళవారం రోడ్డు వెంబడి విద్యుత్ స్తంభాలను పాతుతుండడంతో తాము కొన్ని విద్యుత్ స్తంభాలను తొలగింపజేశామని, పచ్చని పంట పొలాలతో ఉన్న తమ గ్రామాల్లో ఎలాంటి పరిశ్రమలను ఏర్పాటు చేయవద్దని కోరుతున్నారు. విద్యుత్ స్తంభాలు వేయకుండా అడ్డుకున్నవారిలో దర్గా రాంచంద్రయ్య, కాశ మల్లేష్, డి శ్రీను, డి అంజనేయులు, భాను, ఎస్ మల్లేష్, కె శ్రీశైలం, డి మహేశ్‌లు ఉన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వేరే స్థలం నుంచి విద్యుత్ లైన్ వేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, రెండు నెలల క్రితం ట్రాన్స్‌కో అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని పర్వతాపూర్‌నకు చెందిన దర్గా వెంకటేష్ అనే రైతు తెలిపాడు. కాగా, ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ రవి కుమార్ మాట్లాడుతూ రెండు నెలల క్రితం పర్వతాపూర్ గ్రామస్థులు వినతిపత్రం ఇచ్చిన వెంటనే విద్యుత్ స్తంభాలు పాతడాన్ని నిలిపివేయించాం. రైతులకు ఇబ్బందులు కలగనీయం.



చిన్నారులను సన్మానించి, అభినందిస్తున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

## బెల్టుషాపులు బంద్ చేయకపోతే ఉద్యమమే

షాద్‌నగర్ అర్బన్, మే 21: ప్రతి పల్లెలో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపులను నెలరోజుల్లో బంద్ చేయించకపోతే ఉద్యమిస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కందివనం గ్రామంలోని బెల్ట్‌షాపులను మూయించాలని ఆ గ్రామానికి చెందిన విద్యార్థి నవీన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టడంతో ఎక్సైజ్ అధికారులు స్పందించి, బెల్ట్‌షాపులను కట్టడి చేశారు. దాంతో మంగళవారం పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కందివనం గ్రామానికి వెళ్లి, బెల్ట్‌షాపులను బంద్ చేయాలని నిరసన చేపట్టిన విద్యార్థులను సన్మానించి, వారిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ప్రతీ పల్లెలో మద్యం బెల్ట్‌షాపులు అక్రమంగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. పసి బాలుడి నుంచి పండు ముసలి వరకు బెల్ట్‌షాపులను బంద్‌చేయాలని కోరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సైతం తాము అధికారంలోకి వస్తే బెల్ట్‌షాపులను మూయిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. పల్లె ప్రజల జీవితాలను బెల్ట్‌షాపులు నాశనం చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లోని బెల్ట్‌షాపులను నెల రోజుల్లో మూయించకపోతే గ్రామ గ్రామాన ఉద్యమాన్ని చేపడతామని విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. బీజేపీ నాయకులు విజయభాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, పసుల నర్సింహ యాదవ్, బల్వంత్‌రెడ్డి, ఆకుల ప్రదీప్, లక్ష్మీకాంత్‌రెడ్డి, సుధాకర్, అశోక్, నరేందర్‌రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



ఆమనగల్లు : కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు



నందిగామ : అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

నందిగామ, మే 21: మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం అమ్మవారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో కమనీయంగా జరిపించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు, చుట్టుపక్క గ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే నందిగామ మండల పరిధిలోని వెంకమ్మగూడలో ఎల్లమ్మ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ శివశంకర్‌గౌడ్ ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగ నర్సింలు, జిల్లెల్ల రాంరెడ్డి, జిల్లెల్ల బాల్‌రెడ్డి, కొమ్ముక్రిష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి శంకరయ్య, కావలి కృష్ణ, వీరేందర్‌గౌడ్, మంకాల శ్రీశైలం, సతీష్, బుచ్చయ్య, శివ, రాజశేఖర్, సాములయ్య, శ్రీను, శ్రవణ్, మహేష్, రవిందర్, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా లక్ష్మీనరసింస్వామి జయంత్యుత్సవాలు

తలకొండపల్లి : మండలంలోని వెల్జాల వేదాద్రి గుట్టపై గల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం శ్రీ స్వామివారి జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేడుకల నేపథ్యంలో ఆలమాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయామానంగా అలంకరించారు. వెల్జాలతో పాటు సమీప గ్రామాల నుంచి స్వామివారి జయంతి వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు గూడ నర్సింహ శర్మ, శ్రీనివాస మూర్తి, వేద పండితులు మురళీధర్ శర్మ, చంద్రశర్మ ల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక



ఇబ్రహీంపట్నం : సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న పండితులు

● పెద్దఎత్తున పాల్గొన్న భక్తజనం

పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ఆయనను నిర్వాహకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంబాజీ, నాయకులు నరేందర్ గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విజయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, అశోక్, రాజేందర్‌రెడ్డి, మాధవులు, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు..

### మార్చాలలో కనుల పండువగా ఎల్లమ్మ కల్యాణం

ఆమనగల్లు : మార్చాల గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేను నిర్వాహకులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. నాయకులు బ్యాంగి ఆనంద్ కుమార్, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీను, శ్రీకాంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### అనంతపద్మనాభస్వామి ఉత్సవాలు ప్రారంభం

కొత్తూర్ : మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత అనంతపద్మనాభస్వామి దేవాలయంలో మొదటి రోజు మంగళవారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయి. వేదపండితుల ఆధ్వర్యంలో కలశ విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనము, ఆచార్య బ్రహ్మరుత్విక్ వర్ణనము, రక్షాబంధన్, చతుస్థానార్చన అగ్నిప్రతిష్ఠ ధ్వజారోహణం, గరుడ హోమం, గరుడ కల్యాణం, బలిహరణము, హారతి తదితర పూజలు నిర్వహించారు. కొత్తూర్ మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాసుందర్‌రెడ్డి, అనంతపద్మనాభస్వామి ఆలయ పాలకమండలి చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవాలు షురూ

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలో మూడు రోజులపాటు జరగనున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం ప్రాంభమైనాయి. స్వామివారి సుప్రభాత సేవ, మంగళశాసనం, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రుత్విక్‌కరణం, మృత్యుంగ్రహణం, ధ్వజారోహనం, అంకురార్పన, శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహించారు.



కొత్తూర్ : ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పాలకమండలి సభ్యులు

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శంషాబాద్ రూరల్, మే 21 : మరమ్మతుల కారణంగా నేడు(బుధవారం) చిన్నగోల్కొండ, పెద్దగోల్కొండ, సంఘీగూడ, రషీద్‌గూడ, బహదూర్‌గూడ, గొల్లపల్లిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ షేక్ బాషా మంగళవారం పేర్కొన్నారు. చిన్నగోల్కొండ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

### కందుకూరు మండల పరిధిలో..

కందుకూరు, మే 21 : మరమ్మతుల కారణంగా నేడు కందుకూరుటౌన్, కొత్తగూడ టౌన్ విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏఈ రమేష్ గౌడ్ తెలిపారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు టౌన్ ఫీడర్‌లో.. మధ్యాహ్నం 12 నుంచి 2గంటల వరకు కొత్తగూడటౌన్ ఫీడర్‌లో విద్యుత్‌సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

### మొయినాబాద్ మండల పరిధిలో..

మొయినాబాద్ రూరల్, మే 21 : విద్యుత్ తీగల మరమ్మతులు, తీగలకు అడ్డుగా వచ్చే చెట్లను తొలగించనున్న నేపథ్యంలో చిలుకూరు, శ్రీనిధి ఫీడర్ల పరిధిలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని చిలుకూరు పరిధి అధికారి కె.రాజేష్‌బాబు తెలిపారు. బుధవారం ఉదయం 11నుంచి సాయంత్రం 5గంటల వరకు చిలుకూరు గ్రామం, బాలాజీ ఆలయ పరిసరాలు, అప్పోజిగూడ, గండిపేట చౌరస్తా, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ పరిధిలో సరఫరా ఉండదన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఆమనగల్లు, మే 21 : వాహనదారులు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఆమనగల్లు ఎస్సై బాల్‌రామ్‌నాయక్ కోరారు. పట్టణంలో మంగళవారం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోలో పరిమితి కి మించి ప్రయాణికులను తీసుకుపోవద్దని సూచించారు. ఆటో డ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు, యూనిఫామ్ ధరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

## అభివృద్ధి పనులపై నజర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, మే 21 : మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పనితీరుపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రత్యేక పట్టింపేది?' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులతో పాటు ఎంపీపీ కొప్పు సుకన్యబాషా స్పందించారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి మేడిపల్లి గ్రామంలో వృథాగా ఉన్న నీటితొట్టిలో నీటిని నింపించారు. నీటితొట్ల మరమ్మతులపై పంచాయతీ అధికారులకు ఆదేశిస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, పంచాయతీ రాజ్‌శాఖ డీఈ శ్రీనివాస్, మండల ఏఈ ఉస్మాన్‌లు మేడిపల్లిలో హరితహారం నర్సరీని తనిఖీ చేసి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. తాటిపర్తి గ్రామంలో ఎంపీవో ఉమారాణి పర్యటించి పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. హరితహారం నర్సరీని సందర్శించి మొక్కల సంరక్షణపై పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. మురుగు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇదిలా ఉండగా తాను త్వరలో గ్రామాల ప్రత్యేకాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని ఎంపీపీ కొప్పు సుకన్యబాషా చెప్పారు.

# రాజీవ్ కృషితో సాంకేతిక విప్లవం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

● మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి

● విగ్రహాలు, చిత్రపటాల వద్ద నాయకుల నివాళి

షాద్‌నగర్ అర్బన్, మే 21 : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ కృషి ఫలితంగా భారతదేశంలో సాంకేతిక విప్లవం కొనసాగుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాజీవ్ 33వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం షాద్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరాగాంధీ హత్యానంతరం దేశంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాన మంత్రి పదవిని చేపట్టిన రాజీవ్‌గాంధీ దేశం ఉన్నతంగా ఉండాలన్న ఆలోచనతో ప్రణాళికలు రూపొందించి, అమలు చేశారని అన్నారు. దేశంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడంతోనే నేడు భారత్ పపంచ దేశాలతో పోటీ పడుతున్నదని, కూలీ పనిచేసే మహిళ సహితం సెల్‌ఫోన్‌ను వినియోగిస్తున్నదని గుర్తుచేశారు. పల్లెలు అభివృద్ధి చెందాలని జెఆర్‌పై నిధులను ఇచ్చారని అన్నారు. ఎంపీపీ ఖాజా ఇద్రీష్, జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, జగదీశ్వర్, కొంకళ్ళ చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, జమృద్‌ఖాన్, కృష్ణవేణి, హరినాథ్‌రెడ్డి, వీరేశం, సురేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నందిగామ** : రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు జిల్లెల్ల రాంరెడ్డి, బాల్‌రెడ్డి, జంగ నర్సింలు, తుమ్మల నర్సింలు దారలింగం, శ్రీకాంత్, కృష్ణ, లింగం, జంగయ్యగౌడ్, ప్రభయ్య, అంజయ్య తదితరులున్నారు.

**చౌదరిగూడ** : జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. నాయకులు చంద్రశేఖర్, వెంకట్‌నర్సింహారెడ్డి, సత్యనరాయణరెడ్డి, రవికుమార్, సత్తయ్య, ఎల్లేష్, చందునాయక్, గోపాల్, ఖలీల్ తదితరులున్నారు.

**మొయినాబాద్ రూరల్** : భారత దేశాన్ని ప్రపంచ దేశాలతో సైన్స్ అండ్ టెక్నాలజీలో పోటీ పడే విధంగా రాజీవ్‌గాంధీ విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారని పీసీసీ ఎస్సీ సెల్ సభ్యుడు షాబాద్ దర్శన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు కీసరి సంజీవరెడ్డిలు అన్నారు. హిమాయత్ నగర్ చౌరస్తాలోని రాజీవ్ విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. నాయకులు వీరభద్రస్వామి, బొలిగిద్ద సత్యనారాయణ, బాలకృష్ణారెడ్డి, మర్రి రవీందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గౌండ్ల నిరంజన్ గౌడ్, పీఏసీఏస్ చైర్మన్ మండడి చంద్రారెడ్డి, జయరాంరెడ్డి, ఫైలు శ్రీనివాస్, కంజర్ల శేఖర్, మేడిపల్లి ప్రవీన్ కుమార్ తదితరులున్నారు.



షాద్‌నగర్ అర్బన్ : రాజీవ్‌గాంధీ వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ నాయకులు

**ఆమనగల్లు** : గ్రామాల అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు జీవితాంతం పరితపించిన గొప్ప మహనీయుడు రాజీవ్ గాంధీ అని డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్యలు అన్నారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు కృష్ణనాయక్, మండ్లీరాములు, ఎంగళి ప్రసాద్, కాలే మల్లయ్య, పులికంటి మైసయ్య, అలీం, సురేశ్ నాయక్, ఖాదర్, వస్పుల శ్రీకాంత్, మైసయ్య, చంద్రశేఖర్, ఫరీద్, ఫిరోజ్, హరిలాల్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ఢిల్లీలోని వీర్ భూమిలోగల రాజీవ్ గాంధీ ఘాట్‌ను సీడబ్ల్యూసీ సభ్యుడు రాజుతో కలిసి మల్లు సందర్శించారు. ఘాట్ వద్ద నివాళులర్పించారు. నాయకులు వస్పుల జంగయ్య, మధుసూదన్, గుర్రం కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

**కడ్తాల్** : మండల కేంద్రంలో డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు వేణుగోపాల్, గురిగళ్ల లక్ష్మయ్య, గూడూరు భాస్కర్ రెడ్డి, జహంగీర్‌బాబా, లక్‌పతి నాయక్, రాంచందర్‌నాయక్, రాయకంటి బిక్షపతి, కృష్ణ, యాదయ్యగౌడ్, రాజేందర్‌గౌడ్, పోతుగంటి అశోక్, జహంగీర్‌అలీ, మల్లయ్య తదితరులున్నారు.

**తలకొండపల్లి** : మండల కేంద్రంలో రాజీవ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి అంజయ్యగుప్త, కార్యదర్శి రవీందర్ యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్, అజీం, నాయకులు ఆరిఫ్, రమేశ్, డేవిడ్, మల్లేశ్, నర్సింహ్మ, పెంటయ్య, వెంకటేశ్, పురుషోత్తం, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్ రూరల్ : హిమాయత్‌నగర్‌లో రాజీవ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చేవెళ్ల** : రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్ స్వామి అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీటీసీ రాములు, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పాండుయాదవ్, మాజీ సర్పంచ్ భీమయ్య, నాయకులు కృష్ణగౌడ్, శ్రీనివాస్, యాదిరెడ్డి, మాణిక్యం, నరేందర్, రవీందర్‌రెడ్డి, దుర్గప్రసాద్ తదితరులు ఉన్నారు.

**కందుకూరు** : దేశ ప్రజలకు ఐటీ రంగాన్ని పరిచయం చేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎస్.కృష్ణానాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, నాయకులు కె.రాణాప్రతాప్ రెడ్డి, డిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, సరికొండ పాండు, కె.విఘ్నేశ్వర్‌రెడ్డి, గొరిగే రాజు, జి.సుధాకర్‌రెడ్డి, ఎస్ వెంకటేష్‌గౌడ్, ఎస్.రాంరెడ్డి, బుక్క పాండురంగా రెడ్డి, వి.బాబు, యుగేందర్‌గౌడ్, బి.ప్రశాంత్‌కుమార్, మీగడి శేఖర్, బి.ఐలయ్య, యాదగిరి, ప్రశాంత్, పి.శేఖర్, భాస్కర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జంగారెడ్డి, కృష్ణానాయక్



ఆమనగల్లులో రాజీవ్‌గాంధీ వర్ధంతిలో పాల్గొన్న శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, జగన్, మానయ్య



చేవెళ్ల : రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చౌదరిగూడ : రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## క్రైం కార్నర్

### విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత



మృతి చెందిన ఎద్దును పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్

కొందుర్గు, మే 21: విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాతపడిన సంఘటన మండల పరిధిలోని తంగళ్లపల్లిలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బెస్త చంద్రయ్య పొలం నుంచి విద్యుత్ హైటెన్షన్ వైర్ లైన్ ఉంది. అయితే, విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. ఈక్రమంలో మంగళవారం మధ్యాహ్నం చంద్రయ్య ఎద్దులకు నీరు తాగించి, వాటి వెనుక వస్తున్నాడు. అదే సమయంలో విద్యుత్ తీగల వైపు వెళ్లిన ఎద్దుకు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, పొలంలో ఉన్న విద్యుత్ తీగలు కిందికి ఉన్నాయని, వాటితో ప్రమాదం పొంచి ఉందని, గతంలో తాము చెప్పినా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు రూ.75వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధిత రైతు చంద్రయ్య కోరారు. సంఘటన స్థలాన్ని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్, కొందుర్గు పశువైద్య సిబ్బంది సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయమై ఏఈ రవికుమార్ మాట్లాడుతూ ఉన్నతాధికారులకు విషయం తెలియజేస్తామన్నారు. బాధిత రైతుకు ఆర్థిక సహాయం అందేలా తగిన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

### ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు



బావి వద్ద గుమిగూడిన గ్రామస్తులు

మాడ్గుల, మే 21 : మండలంలోని నల్లచెర్వు గ్రామ సమీపాన ఉన్న నారాయణ బావిలో ఈతకొట్టటానికి వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మంగలి శ్రీను కుమారుడు సాయి(20) నల్లచెర్వు సమీపాన ఉన్న నారాయణబావిలో ఈతకొట్టటానికి వెళ్లాడు. అతడితో పాటు అదే గ్రామానికి చెందిన ఏడుగురు కూడా వెళ్లారు. ఈక్రమంలో సాయి కొద్దిసేపు ఈత కొట్టి బావి పైకి వచ్చాడని, అనంతరం ఎక్కడి వెళ్లాడో తెలియదని తోటి యువకులు చెప్పారు. అయితే, అతడి దుస్తులు, సెల్‌ఫోన్ బావి వద్ద ఉండటంతో ఎస్సై ఉపేందర్ సాయి బావిలోనే గల్లంతైనట్లు అనుమానించారు. సాయి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. బావిలో నీరు చాలా ఉన్నందున శవాన్ని బయటికి తీయలేకపోయారు. కాగా, బావికి ఉన్న రెండు మోటార్లతో నీటిని తోడేస్తున్నారు. గ్రామస్తులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు.

### కార్మికుడు అదృశ్యం



సుజిత్‌దాస్

కొత్తూర్, మే 21: కొత్తూర్ పారిశ్రామికవాడలో ఓ పరిశ్రమలో కాంట్రాక్టర్ వద్ద దినసరి కార్మికుడిగా పనిచేస్తున్న సుజిత్‌దాస్(28) అదృశ్యమైనట్లు ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. సుజిత్ దాస్ కోసం కాంట్రాక్టర్ దిల్‌కుమార్‌తో పాటు తోటి కార్మికులు గాలింపులు జరిపినా ఫలితం లేకపోయిందని తెలిపారు. కాంట్రాక్టర్ దిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 8712568270 ఫోన్‌నెంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

### మనస్తాపంతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొందుర్గు, మే 21: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని చెర్కుపల్లిలో జరిగింది. ఇన్‌చార్జి ఎస్సై సక్రం కథనం మేరకు.. మండల పరిధిలోని చెర్కుపల్లి గ్రామానికి చెందిన పి.నర్సింహులు(35)కు పదేళ్ల క్రితం కొత్త ఆగిర్యాలకు చెందిన మాధవితో వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కొంతకాలం నుంచి మాదవి గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని భార్యతో భర్త తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 13న మాధవి తల్లిదండ్రులు, వారి కుమారులు చెర్కుపల్లి వచ్చి నర్సింహులుతో గొడవపడి, దాడి చేశారు. ఈ సంఘటనపై 13న ఫిర్యాదు చేయడంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. దాంతో మాధవి తన పిల్లలతో కొత్త ఆగిర్యాలకు వెళ్లిపోయింది. నర్సింలు తన తండ్రి లక్ష్మయ్యతో చెర్కుపల్లిలో ఉంటున్నాడు. 20న ఉదయం లక్ష్మయ్య చేను వద్దకు వెళ్లాడు. తనపై దాడి చేయడంతో మనస్తాపానికి గురైనట్లు సెల్ఫీ వీడియో తీసిన నర్సింహులు.. మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకొని మృతి చెందాడు. అతడి చెల్లెలు ఎం.జ్యోతి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

ఆమనగల్లు, మే 21 : ఆటో బోల్తా పడి ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని చింతపల్లి సమీపంలో ఆమనగల్లు-షాద్‌నగర్ ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు తలకొండపల్లి మండలం బల్సుపల్లి గ్రామానికి చెందిన జయేందర్ ఐదు మంది కుటుంబసభ్యులతో కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. జయేందర్, కె.జ్యోతి గాయపడ్డారు. ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### టైర్ పేలి గాల్లోకి ఎగిరిన కారు

● పల్టీకొట్టి రోడ్డు పక్కన చెట్టుకు ఢీ

● నలుగురికి స్వల్పగాయాలు..

క్షతగాత్రులంతా హైదరాబాద్ వాసులు

● నల్లగొండ జిల్లాలో ఘటన



చెట్టును ఢీకొన్న కారు

చిట్యాల రూరల్, మే 21 : టైర్ పేలడంతో అదుపు తప్పిన కారు గాలిలోకి ఎగిరి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. క్షతగాత్రులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన ఏర్పుల భాస్కర్, ఆయన భార్య సింధూర, వారి కుమార్తె ఏడాది చిన్నారితో పాటు వారికి సంబంధించిన లక్ష్మి, పూజ కారులో కట్టంగూరులో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. మధ్యాహ్న సమయంలో ఇబ్రహీంపట్నంకు బయలుదేరారు. చిట్యాల మండలం వెలిమినేడు శివారులోకి చేరుకోగానే వారి కారు టైర్ పేలడంతో ఒక్కసారిగా కారు గాల్లోకి 10 అడుగుల మేర ఎగిరి అదుపుతప్పి ఎడమవైపు 30 అడుగుల దూరంలోకి పల్టీ కొట్టి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. హైవేపై వాహనదారులు కారులో ఉన్నవారిని సురక్షితంగా బయటకు తీశారు. కారులో ఉన్న భాస్కర్, సింధూర, లక్ష్మి, పూజలకు గాయాలు కాగా.. చిన్నారికి ఎటువంటి గాయం కాలేదు. సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్న టోల్‌గేట్ వద్ద ఉన్న జీఎంఆర్‌కు సంబంధించిన 1033 అంబులెన్స్‌లోని ఈఎంటీ శ్రీనివాస్ క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో కారు సమీపంలోని వారు ఆందోళనకు గురయయ్యారు. కారు ఎగిరిపడటం, అందులో ఉన్న నలుగురికి గాయాలు కావడం చిన్నారి ప్రాణాపాయం తప్పి క్షేమంగా ఉండటం వారి అదృష్టమని వాహనదారులు తెలిపారు. ప్రమాదంపై చిట్యాల ఎస్సై సైదాబాబును సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## సంక్షిప్తంగా..

**కడ్తాల్** : ముద్విన్ సమీపంలోని నల్లగుట్ట వద్ద మైనింగ్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ కోరారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా అనుమతులు ఇవ్వడమేమిటని ఆయన అధికారులను ప్రశ్నించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అధ్యక్షతన జిల్లా గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

**కడ్తాల్** : ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కేశని జంగయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని పరామర్శించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ప్రభుత్వం ద్వారా రూ.2.10లక్షలు ఎల్‌వోసీ మంజూరుచేయించి చెక్కు ఇచ్చారు.

**ఆమనగల్లు** : ఆమనగల్లు పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీలో నిరుపేదలకు జీఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. యువసేన నాయకుడు చలిచీమల సతీష్ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు పంపిణీ చేశారు. సుమన్‌నాయక్, రమేశ్, తదితరులున్నారు.

**కందుకూరు** : మండలంలోని నేదునూరు గ్రామం నుంచి గాల్వాన్‌కుంట తండా వరకు ఉన్న నక్షబాటలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని నేదునూరు రైతులు మంగళవారం ఆర్‌డీవో, తహసీల్దాలకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజలు రోడ్డుపై నడవడానికి పూర్వం నుంచి నక్షబాట ఉండేదని, ప్రస్తుతం నేదునూరు సమీపంలో ఉన్న 646, 647, 648, 651, 652, 655 సర్వే నెంబర్లలో ఉన్న నక్షబాటను కొందరు ఆక్రమిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై నేడు ఆర్‌డీవో సూరజ్‌కుమార్, తహసీల్దార్ కె.గోపాల్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉన్ని వెంకటయ్య, కృష్ణానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి, కె.చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**యాచారం** : రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ కుటుంబానికి మాజీ సర్పంచ్ అచ్చన జంగయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు రూ.2లక్షల46వేల700 నగదు అందించి ఉదారత్వం చాటుకున్న ఘటన గడ్డమల్లాయాగూడలో జరిగింది. గ్రామానికి చెందిన యార యాదగిరి(40) ఇటీవల గున్‌గల్ గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. భార్య సుశీల, ముగ్గురు కుమార్తెలు వీధినపడ్డారు.

## ఘనంగా గోలి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఆమనగల్లులో కేక్‌కట్ చేస్తున్న బీఆర్‌ఎస్, జీఎస్‌ఆర్ యువసేన నాయకులు

ఆమనగల్లు, మే 21: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాలలో అట్టహాసంగా నిర్వహించారు. బీఆర్ఎస్, జీఎస్ఆర్ యువసేన నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. వృద్ధులు , ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గోలి శ్రీనివాస్ రెడ్డి సేవా నీరతిని ఈ సందర్భంగా పలువురు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనురాధపత్యనాయక్, నాయకులు సయ్యద్ ఖలీల్, సురమల్ల సుబాష్, చలిచీమల సతీష్, బరిగెల రాములు, పాలకుర్ల రాజుగౌడ్, కటమం వెంకటయ్య, సోన శ్రీను నాయక్, సైదులు గౌడ్, రమేశ్ నాయక్, దేరంగుల వెంకటేశ్, జంతుక కిరణ్, సుమన్ నాయక్, కొమ్ము ప్రసాద్, శివ, రమేశ్, రాఘవేందర్, వినయ్, వినోద్, జంగయ్య, మహేశ్, భరత్, చెన్నయ్య, చంద్రయ్య, తిరుపతయ్య, మంగళపల్లి నర్సింహ్మ, మహేశ్, మణి, రాజు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.